# అలకాభరణం

అలకకూడా ఆభరణం లాంటిది. అందాన్ని మరింతగా పెంచుతుంది. కొంతమంది ఆడవాళ్ళకి పలకసరులకన్నా అలకసరులు బాగా సూటవుతాయ్. అసలు మగవాళ్ళ అలకలు కన్నా ఆడవాళ్ళ అలకలకి అందంతో పాటు గౌరవం, గుర్తింపు ఎక్కువన్నది తిరుగలేని చారిత్రాత్మక నిజం. ప్రబంధ కావ్యాల దగ్గర నుంచి ప్రస్తుతం వస్తున్న సినిమాల దాకా నాయకి అలగడం ,ఆనాయకుడు కాళ్ళావేళ్ళా పడడం రివాజు, ఆచారం. అలాగని అలకా భరణం కేవలం ఆడవాళ్ళ సొత్తుకాదు. దాన్ని మగవాళ్ళూ ధరించొచ్చు. అలకలోని రుచి చెబితే అర్థం కాదు. అలిగి చూడాల్సిందే !

అలగడానికి సమయం సందర్భం అనేవి వుంటాయని గుర్తించాలి. వెనకా ముందూ చూసుకోకుండా అలిగి కూర్చుంటే అల్లరి పాలవడం తథ్యం. మన పెళ్ళిలో మనం అలిగితే ఆ దారి వేరు. ఆ ప్రాముఖ్యత వేరు. వార్తల్లో వ్యక్తిగాను. మేన్ ఆఫ్ ది మేరేజ్ గాను గుర్తింపబడతాం. అదే స్నేహితుడి పెళ్ళికెళ్ళి అలిగితే కనీసం కారణం ఏమిటని అడిగేవాళ్ళు కూడా ఉండరు. సిగ్గువిడిచి చెప్పుకున్నా అవతలికి పొమ్మంటారు. అంచేత అలగటానికి టైమింగు చాలా ముఖ్యం. అకాల అలకలు అంత ఆరోగ్యదాయకం కావు. అలిగినపుడు బతిమాలేందుకు కనీసం ఒక్క వ్యక్తి అన్నా లేకపోతే అంతకన్నా నరకవాసం ఆనందదాయకం. అంచేత అలిగే ముందు బలాబలాల్ని అంచనా వేసుకుని ప్రొసీడవడం మంచిది. అసలు భార్యాభర్తలు విధిగా అప్పుడప్పుడు అలుగుతూ వుండాలట. అలకలు తీరేక కలుస్తూ వుండాలట. ఆ థ్రిల్లే వేరని, అది లేకపోతే సంసారాల్లో సారం వుండదని మా సన్యాసిరావు అంటూ వుంటాడు.

అలకల్లో కూడా రకాలున్నాయి. కొంత మంది అలక ఆ కొంపకే పరిమితం. కాని కొంతమంది అలిగితే వీధి వీధంతా అల్లరయి పోతుంది. అట్టుడికిపోతుంది. వాళ్ళందరికీ అదొక బర్నింగ్ ప్రాబ్లమై కూర్చుంటుంది.

అసలు పెళ్ళయిన కొత్తల్లో అలగడం వేరు. పదేళ్ళు కాపరం వెలగపెట్టాక. అలగడం వేరు. ఆలోచించుకుంటే ఎంతో తేడా కనిపిస్తుంది. తొలి రోజుల్లో అయితే ఎంతఘాటు అలకయినా ఇట్టే సమసిపోతుంది. కానీ కాల క్రమేణా పరిస్థితిలో మార్పొచ్చేస్తుంది. ఒక్కోసారి మనం లేక లేక ముచ్చటపడి ఒక్కసారి అలిగినా

ప్రయోజనం ఉండదు. పైగా మనకన్నా రెచ్చిపోయి ఇంట్లో ఆడది కూడా అలిగి కూర్చుంటే ఏం చేయాలో తెలీక అయోమయంలో పడిపోతాం. వంటావార్పులు బంద్, మాటా పలుకు కులుకు జాన్తానై, పిల్లల్ని మనం కేవలం కేకలేస్తే వాళ్ళు సుబ్బరంగా చావగొట్టివదులుతారు. ప్రభుత్వానికి , ప్రతి పక్షానికి మధ్యన ప్రజలు నలిగిపోయినట్టుగా పిల్లలు ఇరకాటంలో పడిపోతారు. మీరేం చేసినా , మాట్లాడినా అవతలి పక్షాన్నుంచి రివర్సులో రెట్టింపు రియాక్షన్ కనిపిస్తుంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లోనే మగవాడనే వాడు ధైర్యసాహసాలు, సమస్యస్ఫూర్తి ప్రదర్శించాలి. అలకని మూర్ఖంగా కంటిన్యూ చేయకుండా సమయం చూసి భార్యమణితో ' రాత్రి మీ నాన్న కల్లోకొచ్చేడోయ్. మనిషి బాగా తగ్గిపోయేడు. ఈ మధ్యన ఉత్తరాలేమన్నా వస్తున్నాయా ' అంటూ మాట కలిపి మనుషుల్లో పడాలి. ఇలాంటి సందర్భాల్లో పుట్టింటి కబుర్లు , దేవుడి ప్రాసాదాలు , మాట కలుపుకోవడానికి బాగా ఉపకరిస్తాయ్. అంచేత అలగడానికి అరవై మార్గాలయితే బయటపడడానికి ఆరువందల మార్గాలున్నాయ్.

కొంతమందికి అలక నిత్యావసర వస్తువు. చీటికీ మాటికీ బిగుసుకుపోతుంటారు. అలక అలవాటయితే కష్టం. ఎవరూ పట్టించుకోరు. అదే అరుదుగా ఏడాదికి లెక్క ప్రకారం ఒకటి రెండుసార్లు అలిగి చూడండి – మహారాజయోగం గేరంటీ. అస్సలు అలగడం తెలీని పురాణ పురుషులుంటారు. వాళ్ళుగాని అలిగితే సృష్టి యావత్తు తారుమారైపోతోంది. భూకంపాలు, జల ప్రళయాలు ఏర్పడతాయి.

అంచేత అలకనేది ఆభరణమే కాదు, ఆటంబాంబు లాంటిది కూడా. మన కోసం , మన ముచ్చట్లు తీర్చుకోవడానికి అలిగినపుడు అది ఆభరణం. ఇంకో వ్యక్తిని లొంగదీసుకోవడానికి అలిగినపుడు అది ఆటంబాంబు. అంటే ఆయుధం. అంచేత మనిషి జీవితంలో అలకకి అంత ప్రాముఖ్యత వుంది. కాబట్టే బలపం పట్టినప్పుడే పెద్దవాళ్ళు మన చేత గిలక, పలక, అలక , తాత పిలక అంటూ వ్రాయిస్తారు. అయినా అలకకి, తాత పిలకకి ఏవన్నా సంబంధం వుందంటారా ! నాకయితే వుందని చిన్న డౌటు......

------- అయ్యిపోయింది -------